వేం నరేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చంద్రం



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సీఎం ప్రజావ్యవహారాలు చూసే వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్ తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ, ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తూ, ప్రభుత్వానికి, ప్రజలకు న్యాయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. సిద్దిపేట జిల్లాలో ఆగిపోయిన పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వేం నరేందర్ రెడ్డి నీ కోరినట్లు తెలిపారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పనులు పూర్తయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన ఏర్పుల మహేష్



నవతెలంగాణ-కొమురవెల్లి

భారత జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మండల బీఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లికార్జున స్వామి శాలువతో సత్కరించి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. రానున్న బ్రహ్మోత్సవాలకు కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి రావాలని కోరారు. వారి వెంట గ్రేటర్ హైదరాబాద్ జాగృతి అధ్యక్షులు అనంతుల ప్రశాంత్, ముక్కు విరాట్ బాబు తదితరులు పాల్గొన్నారు.





పై చేయి

- సంక్షేమ పథకాలతో కాంగ్రెస్‌లో జోష్
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు
- గుమ్మనంగా గులాబీ శ్రేణులు
- అంతా తానైన తన్నీరు హరీశ్‌రావు
- ఎంపీగా గెల్చినా బలపడని కమలం
- ప్రజా సమస్యలపై ఉద్యమాలు
- ప్రజా పునాది పెంచుకున్న సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్‌దే పై చేయి...

2024 సంవత్సరాకంలో జరిగిన రాజకీయ పరిణామాల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌దే పై చేయిగా సాగింది. గతేడాదిలోనే అధికారం చేపట్టినప్పటికీ వెనువెంటనే పార్లమెంట్ ఎన్నికలొచ్చాయి. ఆ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు రావడంతో కాస్త ఉలిక్కిపడినా అధికార పరంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల్ని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాల్ని కాంగ్రెస్ సాగించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలే గెల్చినా పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానానికే పరిమితమైంది. అయినా అధికారంలో ఉండడంతో కింది స్థాయిలోని ప్రజా ప్రతినిధుల్ని కాంగ్రెస్ ఆకర్షించగలిగింది. పటాన్‌చెరులో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి గెల్చిన గూడెం మహిపాల్‌రెడ్డిని తమ పార్టీలోకి చేర్చుకుని సంఖ్యను పెంచుకుంది. సర్పంచ్, ఎంపీటీసీ ఇతర ప్రజా ప్రతినిధులకు కూడా కాంగ్రెస్ కండువా కప్పారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా నుంచి దామోదర రాజనర్సింహ్మ, సిద్దిపేట జిల్లా నుంచి పొన్నం ప్రభాకర్ ఇద్దరూ కీలక మంత్రులుగా ఉన్నారు. మరో పక్క ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రిగా కొండా సురేఖ సైతం ఇక్కడే మకాం వేసి పార్టీని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. మరో పక్క ఉచితంగా ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్, రూ.500లకే గ్యాస్, రూ.2 లక్షల రుణమాఫీ, ఆరోగ్య శ్రీ పెంపు, సన్న వడ్లకు రూ.500 బోనస్, ఉద్యోగ నియామకాలు వంటివి అమలు చేయడంతో ప్రజల ఆధరణ పొందే ప్రయత్నం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పలు సభల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల మెదక్ చర్చి వందేళ్ల వేడుకలు, ఏడుపాయల వన దుర్గ దర్శనం కోసం కూడా సీఎం అధికారిక హోదాలో పర్యటించారు. మరో పక్క బీజేపీ విధానాల పట్ల ప్రజల్లోకెళ్లి ఆందోళనలు కూడా చేశారు. అంబేద్కర్ గురించి అమిత్ షా వ్యాఖ్యలు, అదానీ అవినీతిపైన కాంగ్రెస్ మూడు జిల్లాల్లోనూ ఆందోళనలు చేసింది.

"కాల చక్రం గిర్రున తిరుగుతనే ఉంటది. అందులో క్షణాలు... నిమిషాలు...గంటలు... రోజులు... నెలలు... ఏడాది. ఈ కొలమానాల్లో దేనినీ ఆపలేం. మన జీవన గమనంలో మరో ఏడాది కరిగిపోతుండగా ఇంకో నూతన ఏడాది మన ముందుకు రాబోతుంది. ఆ కాలంతో మనమూ పరుగెత్తక తప్పదు. ఆ పరుగు పందెంలో అనేక అంశాలు మన మధుర జ్ఞాపకాలుగా చేదు అనుభవాలుగా మిగులుతాయి. మన జీవన పరిస్థితుల్ని ప్రభావితం చేసే అంశంగా చెప్పబడే రాజకీయాల్ని నిశితంగా పరిశీలిద్దాం. ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయ ముఖచిత్రం మన కళ్లెదుట కదలాడుతున్న తీరు చూద్దాం"

గుమ్మనంగా గులాబీ శ్రేణులు

పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఊహించని ఓటమిని చవిచూసిన తర్వాత గడిచిన ఏడాది కాలంలో గులాబీ శ్రేణులు గుమ్మనంగా ఉండిపోయారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించడమే కాదు సొంత జిల్లా కావడంతో ఏడు చోట్ల ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో ఒకరు కారు దిగిపోయారు. ఈ ఏడాదిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో తాజా మాజీ ప్రజాప్రతినిధులందరూ కాంగ్రెస్ వైపు మళ్లడంతో కాస్త క్యాడర్ బలహీన పడినట్లైంది. ఆరుగురు ఎమ్మెల్యేలున్నా అందులో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఒక్కరే అసెంబ్లీలో బయటా అంతా తానై పార్టీని నడుపుతున్నారు. ప్రభుత్వంతో ఎదురొడ్డి పనిచేయడం ద్వారా తమ పార్టీ ఎమ్మెల్యేలు పార్టీ వీడకుండా చూస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించే విధానాల్ని ప్రజల్లో ఎండగట్టేందుకు చేపట్టిన ఆందోళనలు, నిరసనల్లో ఎమ్మెల్యేలు, కార్యకర్తలు రోడ్డెక్కారు. పార్టీ నుంచి చేజారే వాళ్ల సంఖ్యను తగ్గించుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోతే మరింత ఢీలా పడే ప్రమాదం లేకపోలేదు.

ఎంపీగా గెల్చినా బలపడని కమలం

అసెంబ్లీ ఎన్నికల్లో బొల్తా పడిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం గులాబీ క్రాస్ ఓటింగ్ వల్ల మెదక్ ఎంపీ సీటు గెల్చింది. అయితే వ్యక్తిగతంగా ఎంపీ పర్యటనలు ఉంటున్నప్పటికీ దుబ్బాకలోనే కమలం పార్టీ బలపడలేకపోతుంది. మూడు జిల్లాల్లోనూ పాత నాయకత్వం, క్యాడర్ తప్ప కొత్తగా బలపడిందేమీలేదు. ప్రధాని మోడీ ఇమేజి, హిందుత్వ సెంటిమెంట్ ప్రచారంతో బలపడాలని చూస్తున్నా మెతుకు సీమ ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితి ఈ ఏడాదిలో రాలేదు. పైగా పార్టీలో గ్రూపుల లొల్లీలు కూడా స్పష్టంగా బయటపడుతున్నాయి. సంగారెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షులు ఒక గ్రూపు ఆమెకు వ్యతిరేకంగా మరో గ్రూపు నడుస్తుంది. మెదక్, సిద్దిపేటలో సైతం ఇదే తీరు ఉంది. పైగా ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన ఇద్దరు ముగ్గురు వ్యక్తులు సైతం బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిపోయారు.

ప్రజా సమస్యలో నిరంతర ఉద్యమాల్లో సీపీఐ(ఎం)

ఓట్లు...సీట్లు ముఖ్యం కాదు... ప్రజా సమస్యలే తమ ఏజెండాగా బావించే సీపీఐ(ఎం) మాత్రం నిత్యం ప్రజా ఉద్యమాలు నడుపుతూ వచ్చింది. ఏడాది కాలంగా అనేక పోరాటాల్ని సాగించింది. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్ని చైతన్యం చేస్తూ వచ్చింది. ముఖ్యంగా కార్మిక వర్గంలో ఎర్రజెండా సమరశీల ఉద్యమాలు నడిపింది. కేంద్రం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ చేపట్టిన సమ్మె పోరాటాలు బాగా సాగాయి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పారిశ్రామిక, అసంఘటిత రంగ, ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, ఆశాలు, అంగన్వాడీలు, మున్సిపల్, గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికులు, రవాణా రంగంలో అనేక పోరాటాలు చేశారు. ట్రిబుల్ ఆర్, నిమ్జ్, డప్పూర్ ఫార్మాసిటీ, మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల పక్షాన సీపీఐ(ఎం) ఉద్యమాలు నడిపింది. రైతు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర కోసం కూడా ఆందోళన చేశారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాల్ని సైతం తిప్పికొట్టేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. నూతన సంవత్సరంలో పార్టీ రాష్ట్ర 4వ మహాసభల్ని జరుపుకోనున్నందున భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ సీపీఐ(ఎం) జెండాను తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు ప్రయత్నిస్తున్నారు. పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనల ద్వారా ప్రజా పునాదిని పెంచుకుంటోంది. కుల బహిష్కరణలు, హత్యల వంటి సంఘటనలపై సీపీఐ(ఎం) ఒక్కటే బాధితుల పక్షాన నిలబడిన పరిస్థితి ఉంది.

సామాజిక సమస్యలపై ప్రజా సంఘాలు

రాజకీయ పార్టీల్లో పలు ప్రజా సంఘాలు సైతం ఈ ఏడాదిలో సామాజిక సమస్యలపై కదిలాయి. జిల్లాలో జరిగిన కుల వివక్ష, దాడులు, గ్రామ బహిష్కరణల వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. అలాంటి సంఘటనలపై కేవీపీఎస్, దళిత, గిరిజన సంఘాలు ఐక్యంగా కదిలాయి. ఇటీవల రాజ్యసభలో అంబేద్కర్ పట్ల అవహేళనగా మాట్లాడిన అమిత్‌షా వ్యాఖ్యల్ని ఖండిస్తూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సామాజిక, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు కదిలాయి.

మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ళ జ్యోతి కృష్ణ



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని అయిన మన్మోహన్ సింగ్ మహా నాయకుడు భారతదేశాన్ని క్లిష్ట పరిస్థితులలో ఆర్థిక సంక్షోభం నుంచి కొత్త ఆర్థిక సంస్కరణలు చేసి, దానా గొప్ప నాయకుడు పద్మ విభూషణ్ గ్రహీత, దేశాన్ని ప్రగతి పథంలో నిలిపిన మహా నాయకుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ తుది శ్వాస వీడడంతో వారు దేశానికి చేసిన సేవలకుగాను ఈ రోజు తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, నేత మహేందర్ రెడ్డి, తూప్రాన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, కౌన్సిలర్లు జిన్నా భగవాన్ రెడ్డి రాములుగారి శ్రీశైలం గౌడ్, చింతల రవీందర్ రెడ్డి, బాణాపురం రాజు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు దీపక్ రెడ్డి, నాగరాజు గౌడ్, టిఎన్ శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, దామోదర్ రెడ్డి, దుర్గం నాగేష్, తుమ్మెట శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు సర్గల నర్సింగరావు, సాదా వెంకటరాములు, జంగం రాములు, జంగం యాదగిరి, శ్రీధర్ రెడ్డి, బొల్లు నాగులు, బొంది సిద్ధిరాములు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కొత్తపల్లి నర్సింగరావు, గుర్రం రాములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె వల్ల విద్యార్థులకు ఇబ్బందులు

ప్రభుత్వం సమ్మెను విరమింప చేసి,వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి..

జేరిపోతుల జనార్ధన్,ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి,సిద్దిపేట

నవతెలంగాణ-మెదక్ డెస్క్



రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారితో చర్చలు జరిపి వారి సమ్మెను విరమింపజేయాలని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు.. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు..ఇంచార్జిలచే తాత్కాలిక బోధన,కేజీబీవీల పర్యవేక్షణల వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేజీబీవీలపై అవగాహన లేని వారిని ఇంచార్జిలుగా నియమిస్తే విద్యార్థులు అన్ని విధాలుగా నష్టపోతారని ఆయన అన్నారు..దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని వెంటనే స్పందించి విద్యార్థులు రోడ్లు ఎక్కకుండా చూసుకోవాలన్నారు..అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి,వారిని రెగ్యులరైజ్ చేయాలని, వారిని విద్యా శాఖలో విలీనం చేసి, అన్ని బెనిఫిట్స్ అందేలా చూడాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపై ఉందని, ప్రజాపాలనలో నూతన ప్రభుత్వంపై తిరుగుబాటు జరగకుండా చూసుకోవాలని హితవు పలికారు.. విద్యార్థులు ఇబ్బందులు పడితే మాత్రం విద్యార్థి సంఘాలుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో విద్యార్థులతో కలిసి పాల్గొని వారి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు

అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- రాజ్యాంగాన్ని రద్దుచేసే కుట్రలో భాగంగానే అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం

నవతెలంగాణ-సంగారెడ్డి



అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐబీ నుంచి న్యూ బస్టాండ్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మల్లేశం మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలు తీవ్రంగా కలిసి వేశాయన్నారు. అందుకు అమిత్ షాను మంత్రి పదవి నుంచి తక్షణం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్లో అమిత్ షా మాట్లాడుతూ 'అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని తలిచే కంటే దేవుళ్ళని తలిస్తే స్వర్గానికి పోతారు' అంటూ వాఖ్యానించడం దుర్మార్గమన్నారు. అంబేద్కర్‌ను అభిమానించే కోట్లాదిమంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజల మనోభావాలను అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని బీజేపీ,ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతంలో భాగమేనన్నారు. గతంలో కూడా అనేకసార్లు కేంద్ర మంత్రులు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సైతం రిజర్వేషన్లను సమీక్షించాలని, భారత రాజ్యాంగాన్ని మార్చడానికి అధికారంలోకి వచ్చామని, అంబేద్కర్ ఒక్కరే రాజ్యాంగాన్ని రాయలేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి ఆ స్థానంలో కోట్లాదిమంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజలను వేల ఏండ్లుగా బానిసలుగా మార్చిన అగ్రకుల మనుస్మృతిని తీసుకురావాలనే ఉద్దేశంతోనే పదేపదే రాజ్యాంగంపై, అంబేద్కర్ పై బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించకపోగా ప్రధాని నరేంద్ర మోడీ సమర్థించే విధంగా మాట్లాడడం బాధాకరమన్నారు. అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేదాకా.. సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ కార్యదర్శి జి. సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి. అశోక్, సీఐటీ యూ నాయకులు శివ,రాజు, నర్సింలు, రాజేష్, లక్ష్మీనారాయణ, మల్లేశం, షబ్బీర్ అలీ, నాగభూషణం, కృష్ణ,రాజు,దుర్గయ్య మోహన్, మల్లేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనుదినం ప్రజల పక్షాన నవతెలంగాణ

- పేదోడి పక్షాన ప్రశ్నించే గొంతుక
- మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్
- నవతెలంగాణ 2025-నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పటాన్‌చెరు




అనుదినం జన స్వరం అంటూ.. ప్రజల పక్షాన నిలుస్తూ పేద బడుగు వర్గాల గొంతుకై నవతెలంగాణ దినపత్రిక పనిచేస్తున్నదని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలంలోని చిట్కుల్‌లో గల తన కార్యాలయంలో నవతెలంగాణ దినపత్రిక నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను నవతెలంగాణ మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్ కుమార్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కృష్ణలతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాటాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యన వారధిగా నవ తెలంగాణ పత్రిక పనిచేస్తున్న దన్నారు. నిజాలను నిర్భయంగా.. వాస్తవాలను వార్తలుగా మలుస్తూ అనునిత్యం పాఠకులకు అందిస్తూ ప్రజల మదిలో నిలిచిపోయిం దన్నారు. నిరంతరం ప్రజల సమస్యలను వెలికితీస్తూ వారి సాధక బాధకాలలో వెన్నుదన్నుగా నిలుస్తూ పేదోడికి అండగా ప్రశ్నించే గొంతుకై సామాన్యుడి పక్షాన, సామాజిక హక్కుల కోసం తన వంతు కృషి చేస్తున్న నవతెలంగాణ దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రిపోర్టర్లు సుదర్శన్ రెడ్డి, వాసుదేవ్, శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు మురళి, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి


- సీఐటీయూ నాయకుల డిమాండ్




నవతెలంగాణ-కొండపాక

గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర జేఏసీ టోకెన్ సమ్మె పిలుపులో భాగంగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ కొండపాక మండల కమిటీ ఆధ్వర్యంలో వెలికట్ట ఎక్స్ రోడ్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బర్మా కొమురయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కార్మికులందరి పర్మనెంట్ చేసి వారి వారి అకౌంట్లో ప్రభుత్వ గ్రాండ్‌తో అకౌంట్లో వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే రకమైన పద్ధతిన పని కొనసాగించాలన్నారు. తారతమ్యాలు లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇతర సమస్యల పరిష్కరించాలని 28న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు పల్లె శ్రీనివాస్, నాయకులు పెరిక మల్లేశం, యాదగిరి, పరుశరాములు, కిష్టయ్య, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మెను చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ అనుబంధ జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల టోకెన్ సమ్మెలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సరిపడా వేతనాలు ఇవ్వడంలేదని, ఉద్యోగ భద్రత కూడా లేదని, మల్టీపర్పస్ పేరిట జీపీ కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కేటగిరీ వారిగా వేతనాలు పెంచాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ లను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మొదటి రోజు మండల వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మెను చేపట్టడం జరిగిందని, రెండో రోజు శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే జనవరి 4న నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల మండల ఉపాధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి కనకయ్య, బాలయ్య, లక్ష్మి, కనకవ్వ, కళవ్వ, పర్శరాములు, కనకయ్య, యాదవ్వ వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



గజ్వేల్: గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి పడ్డ నాలుగు నెలల జీతాలు ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఏడాది అయినా జీతాలు పెంచకపోగా ప్రస్తుతం వస్తున్న జీతాలు నెలలు గడుస్తున్న ఇవ్వడం లేదని, గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలు పస్తులతో జీవనం గడుపుతున్నాయి. కుటుంబాలు అప్పుల భారం బరంలోకి నెట్టబడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నిధిని కేటాయించి వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని ప్రతి నెల ఇవ్వాల్సిన సబ్బులు నూనెలు ఏడాది నుంచి ఇవ్వడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని వేతనాలు ఇవ్వాలని లేనిచో రాబోయే కాలంలో సమ్మెను నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకట చారి గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు యాదగిరి, నర్సింలు, కనుకయ్య, ఎల్లం, నాగరాజు, బాబు, ఎల్లమ్మ, లక్ష్మి, యాదమ్మ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటఅర్బన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె చేస్తున్న సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట సిద్దిపేట రూరల్, అర్బన్, నారాయణరావుపేట మండల కార్మికులు సమ్మెను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వేతనాలు రాకపోవడంతో కార్మికులు కడుపు మార్చుకొని నెలల నుంచి కాలం వెలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు రాకుంటే వాళ్ళు ఎలా జీవిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అంటే ఇదేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెక్కాడితే గాని డొక్కాడని కార్మికులకు వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తుందని ప్రభుత్వాలపై మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి, ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు చెల్లించి, కార్మికులు మరణిస్తే దాన సంస్కారాల కోసం రూ.30 వేలు ఇచ్చి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి, కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పంచాయితీ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెలించాలని అందుకు గ్రీన్ చేనెల్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహించి తమ హక్కులను సాధించుకోవాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ ,యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ నాయకులు బాకీ యాదగిరి, రాజనర్సు, శ్రీకాంత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి : గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికుడు సురేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్ బిల్ కలెక్టర్ సాయంకులకు కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించి ఇన్సూరెన్స్ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆన్లైన్లో నమోదు కానీ పంచాయతీ కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేసి వారికి సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు ఇంద్రమ్మ ఇల్లు కేటాయించి ప్రభుత్వ సంక్షేమ పతకాలు అందే విధంగా చూడాలన్నారు. చనిపోయిన గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వము ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పోచారం మల్లన్న జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-పటాన్‌చెరు



మండలంలోని పోచారం గ్రామ పరిధిలో గల శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరిం చారు. జనవరి 6, 7 తేదీల్లో జాతర సందర్భంగా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పోచారం మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపిటిసి బిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో జహీరాబాద్ యువతికి ఆల్‌ఇండియా 37ర్యాంక్

యువతిని అభినందించి.. సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్



ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా సంస్థ విడుదల చేసిన ఫలితాల్లో జహీరాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారస్తుడు చిద్రి ఉమా, హనుమాన్ గుప్తా దంపతుల కుమార్తె లిఖిత ఆల్ ఇండియా 37 వ ర్యాంక్ సాధించింది. దాంతో ఆ యువతిని ఎమ్మెల్యే మాణిక్ రావు అభినందించి.. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. స్థానిక యువతి దేశస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడం జహీరాబాద్‌కే గర్వకారణ మన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. జహీరాబాద్‌లో సీఏ కోర్సు పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులకు తన వంతు సహకారం అందించాలని లిఖితను కోరారు. ఈ కార్యక్ర మంలో నాయకులు నామ రవి కిరణ్, తులసీదాస్ వ్యాపారస్తులు నీలా రాజ్‌కుమార్, చిద్రి లక్ష్మణ్, లిఖిత తండ్రి హనుమాన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు సందర్శించిన పీడీ

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూ ఇండ్లు నిరుపయోగంగా ఉండడంతో వాటిని పేదలకు అందించే లక్ష్యంతో.. మరమ్మతులు వివిధ అంశాలపై వైస్ చైర్మెన్ దారం శంకర్ సెట్‌తో చర్చించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మైనర్ మరమ్మతులు అన్నింటినీ చేసి.. పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ అందిస్తామన్నారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాలు పేదలందరికీ అందే విధంగా చూస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకలో పాల్గొన్న డీసీసీ కార్యదర్శి

నవతెలంగాణ-మనూర్

మండలంలోని దుదగొండ గ్రామానికి చెందిన యేసయ్య కుమారుడి వివాహం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచులు శేరి రాజు సంజీవ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలో ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధిలో ప్లాస్టిక్ విక్రయిస్తున్న పలుదుకాణాల యజమానులకు మున్సిపల్ చైర్మెన్, కమిషనర్, వైస్ చైర్మెన్ ఆదేశాలతో శుక్రవారం జరిమానా విధించి 50 కిలోల ప్లాస్టిక్‌ని సీజ్ చేసినట్టు చెప్పారు. నారాయణఖేడ్‌ను ప్లాస్టిక్‌రహిత పట్టణంగా మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ వాడకం ఆపాలని.. పలు దుకాణాలపై జరిమానాలు విధించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం

కుటుంబానికి అండగా నిలిచిన జైపాల్ రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం పారిశ్రామికవాడలో నివసించే కడారు కిషన్ (38) ఎక్సల్ రబ్బర్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేసేవాడు. పరిశ్రమ పనుల నిమిత్తం బయటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బొల్లారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి పరిశ్రమ యజమాని రఘునాథ్ రెడ్డితో చర్చించి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పరిశ్రమ నుంచి మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించేందుకు యజమాన్యం అంగీకరించింది.అదేవిధంగా అంత్యక్రియల నిమిత్తం తక్షణసాయం అందజేస్తా మన్నారు. కష్టకాలంలో కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచిన నాయకులకు, పరిశ్రమ యజమాన్యానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోప్షన్ మెంబర్ మునీర్, స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్, యువజన నాయకులు బషీర్, బాధిత కుటుంబ సభ్యులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాల్టీ అభివృద్ధి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మెన్ దారం శంకర్ సెట్ అన్నారు. మున్సిపాల్టీలో రూ.17 కోట్లకు పైగా నిధులను సీసీరోడ్లు, డ్రెయిన్‌ల కోసం యూడీఐఎఫ్‌సి కింద కేటాయించారన్నారు. అందులో భాగంగా జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మున్సిపాల్టీని ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధిలో ముందుపథంలో తీసుకెళ్తామన్నారు. ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ సిబ్బంది క్రాంతి, రవి తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు







నవతెలంగాణ-సంగారెడ్డి

భారతదేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని టీజీఐఐసీ చైర్మెన్ తూర్పు నిర్మల జయ ప్రకాష్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి ఐబీలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడు తూ.. మన్మోహన్ సింగ్ కుటుంబానికి, కాంగ్రెస్ అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు మంత్రి వర్గంలో ఆర్థికశాఖ మంత్రిగా సంస్కరణ లను అమలుచేసి దేశం అభివృద్ధి పథంలో నడవడానికి పునాదులు వేశారని కొనియాడారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా భారతదేశ ప్రగతికి తోడ్పడ్డారన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అలాంటి ఆయన మరణం దేశానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మెన్ తోపాజి అనంత కిషన్, సీడీసీ చైర్మెన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, సోహెల్, కసనీ రాజు, యాదగిరి, నాగరాజ్, శ్రీనివాస్, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి అసమాన్య విజయాలు సాధించిన మహాజ్ఞాని అని కొనియాడారు. ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మంత్రి వర్గంలో ఆర్థికశాఖ మంత్రిగా సంస్కర ణలను అమలుచేసి దేశం అభివృద్ధి పథంలో నడవడానికి పునాదులు వేశారన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశార న్నారు. వారి మరణం దేశానికి తీరని లోటు అన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. దేశ ఆర్థిక, పరిపాలనా రంగంలో అనేక సంస్కరణలు తెచ్చి భారతదేశం ప్రపంచ అగ్ర దేశలతో పోటీపడేలా తన దైన ముద్ర వేశారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జహీరాబాద్ : స్థానిక క్యాంపు కార్యాలయంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌లు పూలమాల వేసి నివాళ్లర్పించారు. పుల మల వేసి తన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించారు. దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన మహా ఆర్థిక మేధావని ఆయన సేవలను గుర్తుకు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా చేసిన సేవలు దేశం ఎన్నటికి మరిచిపోదన్నారు. నిజాయితీ, మంచితనం, సమర్థవంతంగా పని చేయడంలాంటివి మన్మోహన్ సింగ్‌ను చూసి నేర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మెన్ మచ్చేందర్, మాజీ ఆత్మ చైర్మెన్ విజయ్ కుమార్, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, సీనియర్ నాయకులు నామ రవికిరణ్,ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు బండి మోహన్,మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మాజీ ఆలయ చైర్మన్ నర్సింహ గౌడ్, ఎస్టీ సెల్ మండల పార్టీ అధ్యక్షులు హిరు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు : పటాన్‌చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 90వ దశకంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతి పథంలో నిలిపిన మహోన్నత నాయకుడు మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, హనుమంత్ రెడ్డి, సంజీవరెడ్డి, ఉపేందర్ రెడ్డి, సురేందర్ గౌడ్, ఐలేష్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేర్‌రూరల్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా, ప్రణాళికా సంఘంలో, యూజీసీ చైర్మెన్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి వన్నె తెచ్చిన ప్రజలు మెచ్చిన నాయకుడు మన్మోహన్ సింగ్ అని డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటి ఎదుట మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళ్లర్పించి.. శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అన్నారు. నిరాడంబర జీవితం, దేశం పట్ల వారి అంకిత భావం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండలాల అధ్యక్షులు తాహెర్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్లు, మాజీ జెడ్పీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





అమీన్‌పూర్ : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శివాలయం చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల అమీనుపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ పార్లమెంటులో బిల్లు పెట్టి, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావటానికి ఎంతో దోహదం చేశారని శశిధర్ రెడ్డి అన్నారు. అమీనుపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ రమేష్ యాదవ్ మాట్లాడు తూ.. మన్మోహన్ సింగ్ దేశానికి మంచి ఆర్థికవేత్తగా దిశా నిర్దేశం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొల్ల మల్లేష్, లక్ష్మీకాంత్ రావు, ఈశ్వర్ రెడ్డి, నర్రెగూడెం సతీష్, బంధంకొమ్ము శీను, సాయి కాలని మల్లేష్, శీను, భిక్షపతి, మల్లేష్, కృష్ణా యాదవ్, ఇక్రిశాట్ కాలని సలీం, మహేష్, మధురా నగర్ శీను, వెంకటేశ్వర రావు, బెల్లి శ్రీనివాస యాదవ్, రాఘవేంద్ర కాలని రమేష్, నవ్య సైది రెడ్డి, జయ, గోపాల్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట : మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్ మురళీకృష్ణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి భారత ఆర్థిక వ్యవస్థకు తీరని లోటు అని అభిప్రా యపడ్డారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. 1991లో దేశం రాజకీయంగా, ఆర్థికంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రోజుల్లో ఆర్థిక మంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన సంస్కరణలు, ఆర్థిక వృద్ధికి తీసుకున్న చర్యలతో ఇప్పుడు భారతదేశం గొప్ప ఆర్థిక శక్తిగా ఎదిగి ప్రపంచ అగ్ర దేశాలకు దీటుగా ఉన్నదన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలు.. ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనే అంశాలతో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకెళ్లేటట్టు చేశారన్నారు. అలాంటి ఓ గొప్ప ఆర్థిక వేత్తను కోల్పోవటం నిజంగా బాధాకరమన్నారు.



గుమ్మడిదల : భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల గుమ్మడిదల మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేశానికి డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతిని ధులు, అధికారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



కల్హేర్ : భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని భారతదేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు విప్లవాత్మకమైన పథకాలు తీసుకువచ్చిన ఘనత భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కే దక్కు తుందని సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జి దేవదాస్ అన్నారు. మన్మోహన్ సింగ్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవదాస్ మాట్లాడుతూ.. దేశం ఒక గొప్ప ఆర్థిక పితామహుడిని, క్రమశిక్షణ కలిగిన నాయకుడిని కోల్పోయిందన్నారు. భారత మాజీ ప్రధాని ద్వేష ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నప్పుడు దేశ వ్యాప్తంగా ఎన్నో ఆర్థిక సంస్కరణలు, విప్లవాత్మకమైన పథకాలు తీసుకువచ్చి దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన ఆర్థిక మేధావి మన్మోహన్ సింగ్ ఉన్నారు.

రేజింతల్ ఆలయాన్ని సందర్శించిన ఎంపీ



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయాన్ని ఎంపీ సురేష్ షెట్కర్ కుటుంబ సమేతంగా శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆలయ అర్చకులు ఎంపీకి పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎన్నికల్లో భాగంగా మొక్కుకున్న కోరికలకు సంబంధించిన మొక్కులను చెల్లించుకునేందుకు ఆయలాన్ని దర్శించుకున్నారు. మూడు గంటలపాటు అర్చకులు అంగరంగ వైభవంగా యజ్ఞ హెూమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గర్భగుడిలో స్వామివారికి అభిషేకం, మహమంగళహారతి ఇచ్చి ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీని శాలువాతో సన్మానించారు. ఈ పూజల్లో ఎంపీ సోదరుడు నాగేష్ షెట్కర్ తనయుడు రాకేష్ షెట్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చంద్రప్ప, తిరుపతి రెడ్డి, బలరాం రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ముంగి శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు గుణవంతు పాటిల్, మధు, అశ్విన్ తదితరులున్నారు.

కస్టోడియన్ భూములను నిరుపేదలకు పంచాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మాపూర్ కస్టోడియన్ భూములను వెంటనే నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యదర్శి టీఎం ఖాలిక్ అన్నారు. ఈ మేరకు లక్ష్మాపూర్ గ్రామపరిధిలోని కస్టోడియన్ భూము ల్లో సీపీఐ ఎర్రజెండాలతో సుమారు 200మంది నిరుపేద మహిళలు, పురుషులతో కలిసి కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కొక్కరి వద్ద 30, 40 ఎకరాలు కబ్జాల్లో ఉన్నదని.. వారి నుంచి ప్రభుత్వం ఆ భూములను తీసుకొని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సీపీఐ ఆధ్వర్యంలో కస్టోడియన్ భూములను చదును చేసి నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి మూడు ఎకరాల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మెదక్ జిల్లా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్ గౌడ్, శివంపేట్ మండల కార్యదర్శి కిషన్, స్వామి, అశోక్ చారి, కొక్కొండ సత్తయ్య, నల్లవలి మహేష్, ఆయా గ్రామాల నిరుపేదలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెప్టైడ్, న్యూక్లియోటైడ్‌లలో అపార అవకాశాలు





నవతెలంగాణ-పటాన్‌చెరు

పెప్టైడ్‌లు, న్యూక్లియోటైడ్‌లలో అపార వాణిజ్య, పరిశోధన అవకాశాలు ఉన్నాయని.. ఔషధ పరిశ్రమలో వాటికి ప్రాధాన్యం పెరుగుతోందని డాక్టర్ కె.నవీన్ కుమార్, సీనియర్ టెక్నికల్ సేల్స్ మేనేజర్, రికీ గ్లోబల్ ట్రేడింగ్ అభిప్రాయ పడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'వర్తమాన ఫార్మాస్యూటికల్ ఆవిష్కరణలు: పెప్టైడ్స్, బయోసిమిలర్స్' అనే అంశంపై ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. వచ్చే ఏడాది నాటికి ఆ పరిశ్రమ వంద బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, వృద్ధి రేటు 10 నుంచి 12 శాతం ఉంటుందని అంచనా వేశారు. మనదేశంలో పెప్టైడ్ మార్కెట్ 2024 నుంచి 2030 వరకు వార్షిక వృద్ధి రేటు 13.9 శాతం ఉంటుందన్నారు. అదే విధంగా ప్రపంచ పెప్టైడ్ థెరప్యూటిక్స్ మార్కెట్ విలువ 2033 నాటికి 5.9 శాతం వృద్ధి రేటుతో 76.11 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నా రు. పెప్టైడ్ చికిత్సా సామర్థ్యాలను వివరిస్తూ, ల్యాబ్-ఉత్పత్తి చేసిన మానవ ఇన్సులిన్, గ్రోత్ హార్మోన్ తో సహా వివిధ వ్యాధుల చికిత్సలో వాటి కీలక పాత్రను డాక్టర్ నవీన్ ప్రముఖంగా ప్రస్తావించారు. క్లినికల్ డేటా సైన్స్ భవిష్యత్తు: ఉద్భవిస్తున్న ధోరణులు, అవకాశాలు' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో క్లినోసోల్ రీసెర్చ్ వ్యవస్థా పకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి సీ.ఎస్.ముజీబుద్దీన్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఔషధ పరిశ్రమలో జరుగుతున్న అభివృద్ధి, పరిశోధన-అభి వృద్ధి, క్లినికల్ ట్రయల్స్, ఔషధ అభివృద్ధి, ఫార్మాకోవి జిలెన్స్, తయారీ, నియంత్రణ వంటి పలు రంగాలలో ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకో వడానికి ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని, ఆయా రంగాలకు తగిన నైపు ణ్యాలను అలవరచుకోవాలన్నారు. రెజ్యూమ్ తయారీ, స్మార్ట్ హైరింగ్ పద్ధతులు, నెట్‌వర్కింగ్ ప్రాముఖ్య తలను వివరించారు. అంతేగాక, ఆధునిక ఇంట ర్వ్యూ పద్ధ తులు, యజమాని అంచనాలను ప్రస్తావించారు. పోటీ ఉద్యోగ మార్కెట్లో అభివృద్ధి చెందడానికి విద్యార్థులకు ఆచర ణాత్మక వ్యూహాలను అందించారు. క్లినికల్ డేటా సైన్స్, డేటా ఆధారిత ఆరోగ్య సంరక్షణ వంటివి వేగంగా వృద్ధి చెందు తున్న రంగాలుగా ముజీబుద్దీన్ పేర్కొన్నారు. విడివి డిగా జరిగిన ఈ కార్యక్రమాల అతిథులిద్దరినీ ఫార్మసీ ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ కె.శివకుమార్ స్వాగతించి, సత్కరించగా, డాక్టర్ శ్రీకాంత్‌వందన సమర్పణతో ముగిశాయి. కెరీర్ గైడెన్స్ సెం టర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమాకాంత్ బాల్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 28, 29,30 తేదీల్లో నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆరో మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సాయిలు అన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి .సాయిలు నాయకులు చందర్ రాథోడ్, దేవేందర్, అశోక్, కృష్ణ, అర్జున్, జనార్ధన్, రాజేశ్వరి తదితరులు స్థానిక కలెక్టరేట్ వద్ద అభివాదం చేస్తూ ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభల్లో చర్చించి పరిష్కార మార్గాలను రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తారన్నారు. ఎస్ఈపి 20-20 రద్దు చేయాలని, సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్సి వర్తింపజేయాలని, సమ్మె చేస్తున్న సర్వ శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులకు బేసిక్ పే వర్తింపజేస్తూ నిర్ణయించి సమ్మెను విరమింపజేయాలని తదితర డిమాండ్ల పైన చర్చ జరుగుతుం దన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్థానిక ఎంపీ, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే. జంగయ్య, చావా రవి, ప్రజా కవి సుద్దాల అశోక్ తేజ, తదితరులు హాజరవుతారన్నారు. ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి నుంచి నేడు ఉదయం 7:30 గంటలకు నల్లగొండ వెళ్లడానికి స్థానిక కలెక్టరేట్ వద్ద బస్సు సిద్ధంగా ఉంటుందన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్ర స్థాయిలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. జమ్మూ కాశ్మీర్ లో జరిగిన 37వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ సబ్ జూనియర్ బాలికల జట్టు ఫైనల్‌లో ఆంధ్రప్రదేశ్ పై 5-2 తేడాతో గెలుపొందిన శుభ సందర్భంగా మెదక్ జిల్లా నుంచి రాష్ట్ర జట్టులో ప్రాతినిథ్యం వహించిన క్రీడాకారులు కెప్టెన్ కార్తీక శ్రీకృతి గౌడ్ గీతికా రెడ్డి నిశాంత్ లను మెదక్ ఎంపీ రఘునందన్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ పార్లమెంట్ కన్వీనర్ వర్గంటి రామ్మోహన్ గౌడ్, సంఖ్య యాదగిరి, మెదక్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ట్రెజరర్ గోవర్ధన్ గౌడ్ కుమార్ గౌడ్ వెంకట్ రెడ్డి వెంకట్ రాజు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక శాతం కేటాయించాలి

- ఎమ్మెల్సీ కవితను కలిసిన మండల నాయకులు



నవతెలంగాణ-మనోహరాబాద్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక శాతం స్థానాలను కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి విన్నవించారు. మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నూకల వెంకటేష్ యాదవ్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధికారంలోనే బీసీలకు పూర్తి న్యాయం జరిగిందని అలాగే బీసీ డిక్లరేషన్ త్వరగా వచ్చే విధంగా శాసనమండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన ఎమ్మెల్సీ కవితను కోరినట్టు తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అధిక శాతం స్థానాలు కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలంటూ కవితను కోరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యలో డాక్టరేట్ పొందిన పైతర యాదగిరి




నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

హవేలీ ఘనపూర్ మండలం శమ్నాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పైతర యాదగిరి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్ పి.వెంకట్ రెడ్డి చేతులమీదుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో శుక్రవారం అందుకున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ వ్యాయామ విద్యా విభాగంలో పరిశోధన చేసినందుకుగాను యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్‌ని ప్రదానం చేశారు. ఏ స్టడీ ఆఫ్ హెల్త్ రిలేటెడ్ ఫిజికల్ ఫిట్నెస్ అమాంగ్ గురుకుల స్కూల్స్ స్టూడెంట్స్ ఇన్ మెదక్ డిస్ట్రిక్ట్ తెలంగాణ అనే అంశం మీద 6 సంవత్సరాలు పరిశోధన చేశారు.మలి దశ ఉద్యమంలో నిజాం కాలేజీ నుండి ఓయు జేఏసీ నేతగా పోరాడి, తెలంగాణ రాష్ట్రం సిద్ధించేలా తన వంతు పాత్ర పోషించారు. యూనివర్సిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్ పి. వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో వ్యాయామ విద్యా విభాగంలో డాక్టరేట్ సాదించేందుకు సహకరించిన యూనివర్శిటీ ప్రొఫెసర్లకు, అధికారులకు, యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్‌లకు ఈ సందర్భంగా డాక్టర్. యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ-పాపన్నపేట

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన యాదగిరి పైతర ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్.పి.వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో అందుకున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో వ్యాయామ విద్యా విభాగంలో పరిశోధన చేసినందుకుగాను యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్‌ని ప్రదానం చేశారు. 'ఏ స్టడీ ఆఫ్ హెల్త్ రిలేటెడ్ ఫిజికల్ ఫిట్నెస్ అమాంగ్ గురుకుల స్కూల్స్ స్టూడెంట్స్ ఇన్ మెదక్ డిస్ట్రిక్ట్ తెలంగాణ' అనే అంశం మీద 6 సంవత్సరాలు డాక్టర్. యాదగిరి పైతర పరిశోధన చేశారు. మలి దశ ఉద్యమంలో నిజాం కాలేజీ నుంచి ఓయు జేఏసీ నేతగా పోరాడి తెలంగాణ రాష్ట్రం సిద్ధించేలా తన వంతు పాత్ర పోషించారు. యూనివర్సిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్ పి. వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో వ్యాయామ విద్యా విభాగంలో డాక్టరేట్ సాధించేందుకు సహకరించిన యూనివర్శిటీ ప్రొపెసర్లకు, అధికారులకు, యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్‌లకు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, కుర్తివాడ గ్రామ ప్రజలందరికీ ఈ సందర్భంగా డాక్టర్. యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి వద్ద జన జాతర



నవతెలంగాణ-మెదక్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి వద్ద రాష్ట్ర నలుమూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తూనే ఉన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక భక్తులు భారిగా తరలి వస్తూనే ఉంటారు. మెథడిస్టు అన్న చర్చి ముందు ఉన్న గృహాలలో వసతి పొంది మొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్ రంగారెడ్డి మెదక్ , ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాల నుంచి నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రం నుంచి అయితే భక్తులు తరలివస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. గురువులు వచ్చిన భక్తులకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వాదాలు కుమ్మరించారు. కొత్త సంవత్సరం వేడుకలు సైతం ఇక్కడ నిర్వహించుకుంటారు. అందుకు అసలు సౌకర్యాలు డయాసిస్ ప్రాపర్టీ మేనేజరు మేనేజర్ గెలన్ చిత్తరంజన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.

శివ్వంపేటలో మైనంపల్లి హనుమంతరావు పర్యటన

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-శివ్వంపేట

మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పర్యటించారు. మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ ఇంటిలో ఏర్పాటు చేసిన తేనేటి విందులో మైనంపల్లి పాల్గొన్నారు. మైనంపల్లికి శివ్వంపేటలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటికి వచ్చిన మైనంపల్లిని కొడకంచి బ్రదర్స్ శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు. మైనంపల్లి పర్యటనతో శివ్వంపేట కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ నెలకొన్నది. మైనంపల్లి వెంట డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు చిట్కూల్ మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, కొడకంచి రవీందర్ గౌడ్, కొడకంచి నర్సిములు గౌడ్, కొడకంచి గణేష్ గౌడ్, జంగం వెంకటేష్, బాసంపల్లి శ్రీనివాస్ గౌడ్, సూర్యం చౌహన్, గేమ్ సింగ్, హమీద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

నూతన ఎస్ఐని సన్మానించిన నాయకులు



నవతెలంగాణ-శివ్వంపేట

శివ్వంపేట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ఇటీవలే నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మధుకర్ రెడ్డిని శుక్రవారం పిల్లుట్ల గ్రామానికి చెందిన యువ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మెన్ పిల్లి మధు, యువ నాయకులు బుర్ర మురళీ గౌడ్, హంసాన్ పల్లి దినేష్ రెడ్డి, పిల్లి మధు, బొమ్మిరాల శంకర్, మస్కురి కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-మెదక్

భారతదేశం మాజీ ప్రధాని మరణం తీరనిలోటు అని షేర్‌ఇట్ సుభాష్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రజలు మర్చి పోలేదు అన్నారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. దేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో వున్నప్పుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థికరంగ నిపుణుడుగా తన విద్వత్తును ప్రదర్శించారని కొనియాడారు. పీవీ మనసు గెలిచిన అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భారతమాత ముద్దుబిడ్డగా కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భమని, మిత భాషిగా, అత్యంత సౌమ్యుడుగా, జ్ఞానాన్ని సొంతం చేసుకున్న స్థిత ప్రజ్ఞత కలిగిన నేతగా, భారత ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలు గొప్పవన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని గుర్తు చేసుకున్నారు. ప్రధానిగా తెలంగాణ ఏర్పాటు సందర్భంగా వారందించిన మద్దతును, చేసిన కృషిని తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని ఎమ్మెల్సీ అన్నారు. మన్మోహన్ సింగ్ మరణం భారత దేశానికి తీరని లోటని సుభాష్ రెడ్డి అన్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నవతెలంగాణ-మెదక్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు హఫీజ్ ఉద్దీన్ మొల్సాబ్ తెలిపారు. ఆయన మృతి తీరనిలోటు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలనేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్థిక సంస్కరణలు తెచ్చిన మహానేత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ వైస్ చైర్మన్ చంద్ర భవన్ రాగి అశోక్ జీవన్ రావు, సలీం చింటూ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల నిజాంపేట మండల్లో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల లేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఎన్నో ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆర్బిఐ గవర్నర్‌గా ఆర్థిక శాఖ మంత్రిగా దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. ఉపాధి హామీ పనులు ఆర్.టీ.ఐ చట్టం, గృహ హింస చట్టం, నిర్భయ చట్టం, లాంటి చట్టాలను తీసుకువచ్చి ఒక మార్గదర్శకుడయ్యారన్నారు. దేశం క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పుడు ఆర్థిక సంస్కరణలు చేసి పరిపాలన సౌలభ్యాన్ని కొనసాగించారన్నారు. ఈ కార్యక్రమంలో జిట్టి మారుతి, పంజా మహేందర్, ఎండి నసీరుద్దీన్, మోహన్ రెడ్డి, బాజే రమేష్, వై వెంకటేశం, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, రమా వత్ శ్రీనివాస్, మహేష్, బక్కోళ్ల బాగులు, రాజేందర్ గౌడ్, భూమా గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-శివ్వంపేట

మాజీ భారత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ శుక్రవారం తుది శ్వాస





విడవడంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, బాసంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఉషగోని శంకర్ గౌడ్,కొడకంచి గణేష్ గౌడ్, ప్రధానకార్యదర్శి కందికొండ అశోక్,ఆత్మకమిటీ మాజీ చైర్మన్ సూర్యం చౌహన్ నేతృత్వంలో దివంగత మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ప్రధాని దేశానికి చేసిన సేవలు, ఆర్థిక సంస్కరణలను కొనియాడారు. నీతి, నిజాయితీ, మంచితనం మన్మోహన్ సింగ్ ను చూసి నేర్చుకోవాలనిఆయన లేని లోటు దేశానికే తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్దు నాయక్, రాజు నాయక్, హమీద్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూర్చాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని కోరుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో బస్టాండ్ చివరస్త ఆవరణంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి మాట్లాడారు. మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ఏరుకోరి తెచ్చుకున్న ఆర్థిక నిపుణుడు, అందుకే మంత్రిని చేసి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చి భారత దేశ ఆర్థిక సరళీకరణ చేసి భారత దేశ ఆర్థిక ఎకనామిక్ పెరగడానికి ప్రధాన కారకుడయ్యారని కొనియాడారు. రాజనీతజ్ఞుడు ఒక మంచి మనిషి మరణించడం బాధాకరమన్నారు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూర్చాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి మాజీ వైసీపీ సుధాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు హస్ల మల్లేశం దుర్గా గౌడ్ శేఖర్ గౌడ్ ముక్తా బాయ్ శ్రీశైలం కిష్టయ్య మల్లేష్ తోపాటు మరికొంతమంది ఉన్నారు.

నవతెలంగాణ-టేక్మాల్

దేశ మాజీ ప్రధాని, గొప్ప ఆర్థికవేత్త,సంఘ సంస్కర్త గౌరవ డాక్టర్







మన్మోహన్ సింగ్ గారి మృతి దేశానికి తీరని లోటు అని టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మృతికి సంతాపంగా టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక టేక్మాల్ బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేసి ఆర్థిక వృద్ధి సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, జోగిపేట్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ,డైరెక్టర్ రాజేష్ గౌడ్, ఎన్ ఎస్ యూ ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ రెడ్డి, మాజీ మండల కోసం సభ్యులు షేక్ మజర్,టేక్మాల్ పట్టణ అధ్యక్షులు భక్తుల కిషోర్, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సిద్దు, ఉపాధ్యక్షులు ఖాజా,మండల సీనియర్ నాయకులు ఆకులపల్లి పాపయ్య,భూంరెడ్డి,రాంచెందర్,సాక్య, చల్ల అనిల్, సాయిబాబ,వివిధ గ్రామాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేష్, శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ నాయకులు గజేంధర్ గౌడ్, గొల్ల శ్రీనివాస్,విశ్వేశ్వర్,,శ్రీనివాస్,నారి,చింటూ, నాయకులు సేవాలాల్, మహేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు విభజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

మల్టిపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ.మహేందర్ రెడ్డి డిమాండ్
- జీపీ కార్మికుల టోకెన్ సమ్మెకు మద్దతు

నవతెలంగాణ-శివ్వంపేట

గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండల కేంద్రమైన శివ్వంపేటలో గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం చేపట్టిన టోకెన్ సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ. మహేందర్ రెడ్డి హాజరై సమ్మెనుద్దేశించి మాట్లాడుతూ జీపి కార్మికులకు ఐదారు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఇంతవరకు చెల్లించకపోవడం ధారుణమని ఆయన మండిపడ్డారు. మల్టిపర్పస్ విధానంతో జిల్లాలో ఎంతో మంది జీపి కార్మికులు గ్రామపంచాయతీ ట్యాంకర్, ట్రాక్టర్, కరెంట్ పనులు చేస్తూ మరణించడం జరిగిందని, కనీసం వారికి ఇన్సరెన్స్ సౌకర్యం లేకపోవడంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులందరిలో ఎక్కువ శాతం దళిత, గిరిజనులేనని జీఓ 51ని సవరించి మల్టిపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీఓ 60 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించడం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం రూ.10 లక్షలు చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి శంకర్, బాలకృష్ణ, వసంత, నర్సిములు, పద్మ, స్వామి, కృష్ణ, బిక్షపతి, హరి, రాములు, తదితరులు పాల్గొన్నారు.



మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి

- గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్

నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వమే గ్రాండ్ ద్వారా కార్మికులకు వేతనాలను చెల్లించాలని అలాగే మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ రోజు మనోహరాబాద్ మండల కేంద్రంలో టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చనిపోయిన సందర్భంగా ముత్యాలమ్మ గుడి పక్కన మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి సంతాపం ప్రకటించారు. టోకెన్ సమ్మె సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు దాదాపు 3 నుంచి 4 నెలల వరకు పెండింగ్ వేతనాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించి బకాయి పడిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వేతనాలు ప్రభుత్వమే గ్రాంట్ ద్వారా వేచించాలని కోరుతూ ఈరోజు విధులను బహిష్కరిస్తూ టోకెన్ సమ్మె నిర్వహించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జేఏసీతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని లేనియెడల నూతన సంవత్సరం 2025లో మొదటి వారంలోనే నిరవధిక సమ్మెకు వెళ్తామని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆసిఫ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరేష్ శ్రీకాంత్ మహేష్ సురేష్ అర్జున్ బిక్షపతి సత్యనారాయణ రమేష్ బాలమణి శోభ లక్ష్మి పుష్ప నవనీత ఎల్లమ్మ సునీత తదితరులు పాల్గొన్నారు



రత్నాపూర్ పశువైద్యశాల దుస్థితిని బాగుచేయండి

- ఆసుపత్రి పరిసరాలన్ని కూడ చెత్త చెదారమే
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-శివ్వంపేట

నోరు లేని మూగ జీవాల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం గ్రామాలలో పశు వైద్యశాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే మండలంలోని రత్నాపూర్ గ్రామంలో స్వర్గీయ ప్రద్యుమ్నరెడ్డి హయాంలో పశు వైద్యశాల నిర్మిం చారన్నారు. ఇదంతా చెప్పడానికి బాగానే ఉన్నాగాని రత్నాపూర్ పశు వైద్యశాల పరిసరాలు మాత్రం కళావిహీనంగా తయారయ్యాయి. ఆసుపత్రి ఆవరణంతా మట్టిమయంగా, చుట్టూ చెత్త చెదారంతో కనీసం అక్కడ కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. అస్వస్థతకు గురైన పశువులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటేనే అక్కడి పరిసరాలు చూసి రైతులు భయపడాల్సిన దుస్థితి నెలకొన్నది. సంబంధిత పశు వైద్య అధికారులు పట్టించుకోకపోవడంతోనే వైద్యశాల పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయని గ్రామస్తులు మండిపడుతు న్నారు. కనీసం గ్రామపంచాయతీ కార్యదర్శి కూడ తన జీపీ సిబ్బందితో ఆసుపత్రి పరిసరాలు శుభ్రం చేయించకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు తక్షణమే స్పందించి నోరులేని మూగ జీవా ల పశు వైద్యశాలను, పరిసరాలను బాగుచేయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. తపస్



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సమ్మెలో భాగంగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ వేదన చెందుతున్న వారు తమను విద్యా శాఖలో విలీనం చేసి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనాలను అమలు చేసి ఆరోగ్య భీమాను వర్తింపజేయాలని కోరుతూ గత 18 రోజులుగా సమ్మె చేస్తుంటే కనీసం ప్రభుత్వం వారితో చర్చలు జరపకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె నేపథ్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల బాధ్యతలను ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దీనివలన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం పట్టుదలకు పోకుండా వారితో చర్చలు జరిపి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, కృష్ణమూర్తి తపస్ జిల్లా నాయకులు రేఖా, సుమతి, సురేందర్, దేశపతి కృష్ణమూర్తి,అమరేశ్వరి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్లపై చర్య తీసుకోవాలి

-కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తూ ఇమామ్



నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్ధిపేటలోని 14వ వార్డు మచ్చవాని కుంటలో పతంగి ఎగరేస్తూ 14 ఏండ్ల బాలుడు మృతికి సిద్ధిపేట మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్‌ల నిర్లక్ష్యమే కారణమని సిద్ధిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తూ ఇమామ్ ఆరోపించారు. మృతికి కారణమైన మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ అత్తూ ఇమామ్ ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ నిధులను కాజేసారన్నారు. చెరువులను క్లీన్ చేయకపోవడంతోనే బాలుడు పతంగి ఎగరేస్తూ చేరులో మునిగి చనిపోయాడన్నారు. వెంటనే పోలీసులు సుమోటో కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. బాలుడు కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాలుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట పట్టణ ప్రధాన కార్యదర్శిగా గ్యదారి మధు, పట్టణ యువజన అధ్యక్షులు గయాజుద్దీన్, నర్సింగ్ యాదవ్, నజ్జు, విజయ డానియల్ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ సమయాన్ని వృథా చేసుకొంకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాజు అన్నారు. జగదేవపూర్ మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం చౌరస్తాలో బిజీ వెంకటాపూర్ గ్రామానికీ చెందిన రఘుపాల్ ఏర్పాటు చేసిన "ప్రణవి హెూటల్ మెస్" ను హెూటల్ ను మండల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాజు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిరణ్ గౌడ్, జగదేవపూర్ మాజీ సర్పంచులు కొంపల్లి కర్ణాకర్ తిగుల్ కప్పర భాను ప్రకాష్, బిజీ వెంకటకటాపూర్ నీల మంజుల రమేష్, లక్ష్మీ శ్రీనివాస రెడ్డి, మండల ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షులు హేమ సురేష్ ముదిరాజ్, మండల నాయకుల్డ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పర్యటన

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంతో పాటు మద్దూరు, దూలిమిట్ట మండల కేంద్రాల్లో నేడు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. చేర్యాల పట్టణ కేంద్రంలోని రేణుకా గార్డెన్‌లో చేర్యాల పట్టణ, చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన సీఎం ఆర్ఎఫ్ చెక్కులు, మద్దూరు, దూలిమిట్ట మండల కేంద్రాలలోని తహసీల్దార్ కార్యాలయాలలో కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

కాల్వల పనులు పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో రంగనాయక్ సాగర్ కుడి కాల్వల పనులను ఇరిగేషన్ డీఈఈ చంద్రశేఖర్, ఎఈఈ రాజులు శుక్రవారం పరిశీలించారు.ఆ గ్రామంలో రైతులతో మాట్లాడారు. వారి వెంట మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్, మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మిరుదొడ్డి

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎద్దు ఎల్లవ్వ కుటుంబాన్ని మాజీ ఉపసర్పంచ్ గురక పరశు రాములు పరామర్శించారు. అనంతరం వారి కుటుంబానికి అండగా ఉంటానన్నారు. గ్రామంలో సఫాయి కార్మికులుగా పనిచేస్తున్న పరశురాములు తల్లి ఎల్లవ్వ మృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ఆయన ఆర్థిక సాయం అందించడంతోపాటు అంత్యక్రియల కోసం కొంత డబ్బును అందించారు. ఈ కార్యక్రమంలో దీపం పల్లి కనకయ్య తాళ్లపల్లి భైరవ చారి పాలమాకుల అరుణ్ కుమార్, రమేష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ బంద్

-మర్కుక్ విద్యుత్ ఏఈ సుధీర్



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో గ్రామ పరిదిలో గల 132/33కెవి సబ్ స్టేషన్లలో మరమత్తులు కారణంగా మండలలోని అన్ని గ్రామాలకు 3 ఫేజ్ విద్యుత్ సేవలు ఉదయం 10.00నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకు నిలిపి వేయబడునని మర్కుక్ విద్యుత్ ఏఈ సుధీర్ శుక్రవారం తెలిపారు. కావున మండలంలోని రైతులు, వినియోగదారులు అందరూ గమనించి, సహకరించగలరని కోరారు.

ఢిల్లీరాజుకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-మిరుదొడి

సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్ధి భూపతి గౌడ్, ఐలయ్య సత్యనారా యణలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రా నికి చెందిన ఢిల్లీ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో గంజి కొండల్ రెడ్డి, జర్నలిస్టులు మహేష్, బీఆర్ఎస్ నాయకులు భైరయ్య, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై మొక్కజొన్న విత్తనాలు

-ఏఓ సంతోష్



నవతెలంగాణ-బెజ్జంకి

జాతీయ ఆహార భద్రత కమిషన్ పథకంలో యాసంగి కాలానికి మండలానికి సుమారు 4 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు జిల్లా వ్యవసాయ శాఖాధికారి కేటాయించినట్టు శుక్రవారం ఏఓ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న విత్తనాల కొనుగోళ్లలో రైతులకు రాయితీపై అందజేయనున్నట్టు ఏఓ తెలిపారు

మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన కార్మికులు



నవతెలంగాణ-నంగునూరు

మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ అకాల మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ 92 ఏండ్ల జీవిత కాలంలో దేశానికి అనేక సేవా కార్యక్రమాలను చేశారని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు రాజమౌళి, రవీందర్, కనకయ్య, బాలయ్య, లక్ష్మి, కనకవ్వ, యాదవ్వ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

-3 తులాల బంగారం, రూ.7,630 నగదు స్వాధీనం




నవతెలంగాణ-సిద్ధిపేటఅర్బన్

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.7630ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ అల్వాల సూర్య నగర్ కాలనీకి చెందిన తూర్పాటి ప్రసాద్ జులైగా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో నవంబర్ నెల 11వ తేదీన సిద్ధిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేంద్రనగర్ హనుమాన్ దేవాలయంలో ఉండి నీ పగలగొట్టి అందులోనే డబ్బులను ఎత్తుకెళ్లాడు. అదే రోజు సందీప్ నగర్‌లో ఉన్న బండారి సక్కుబాయి, ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ. 90వేలు విలువ ఉన్న బంగారు వస్తువులను దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న త్రీ టౌన్ పోలీసులు కేసులు నమోదు చేసి, పరిశోధన ప్రారంభించి శుక్రవారం నేరస్థుడు రంగధాంపల్లి చౌరస్తా వద్ద ఉన్నడనే నమ్మదగిన సమాచారంతో ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని, నిందితున్ని పట్టుకొని విచారించగా రెండు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకోగా నిందితుని వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నదదును స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి జుడు విషయాలు రిమాండ్కు పంపించినట్లు సీఐ తెలిపారు. కాగా అతను గతంలో కూడా పలు జిల్లాల్లో ని ఇండ్లలో దొంగతనం కేసులలో పలుమార్లు జైలుకు వెళ్ళి వచ్చినట్లు తెలిపారు. నేరస్తుని పట్టుకోవడంలో కీలక పాత్ర వహించిన ఎస్ఐ తిరుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, బాబు లను సిద్దిపేట ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్‌లు అభినందించారు.

నామినేటెడ్ పదవులు దక్కేది ఎవరికో..?

- అధిష్టానం చుట్టూ నాయకుల ప్రదక్షిణాలు
- పదేళ్లుగా పదవులకు నోచుకోని కాంగ్రెస్ నేతలు
- జిల్లాలో 41 నామినేటెడ్ పోస్టులు





నవతెలంగాణ -దుబ్బాక

పదేళ్ల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. ఇన్నేళ్లకు తమ పార్టీ సర్కార్ కొలువు తీరడంతో ఇప్పటిదాకా ప్రతిపక్ష నాయకులుగా ఉన్న కాంగ్రెస్ నేతల్లో కొత్త ఆశలు మొగ్గ చిగురిస్తున్నాయి. ప్రతిపక్ష నాయకులుగా ప్రజా సమస్యల పరిష్కారానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఇటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రధాన నాయకులు, సీనియర్ కార్యకర్తలు జిల్లా, మండల స్థాయిలో నామినేటెడ్ పోస్టులపై గంపెడాశలు పెంచుకుంటున్నారు. పదేళ్లుగా పదవులకు నోచుకోని కాంగ్రెస్ నేతలు అధిష్టానం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. సిద్ధిపేట జిల్లాలో 41 నామినేటెడ్ చైర్మెన్ పోస్టులు ఉండగా అందులో కొన్నింటిని కాంగ్రెస్ సర్కార్ భర్తీ చేసింది. కాగా మిగిలిన వాటికోసం చాలామంది నాయకులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. తాము కోరుకుంటున్న కమిటీల్లో తమకు స్థానం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ మంత్రులు, నియోజకవర్గ ఇన్చార్జిల చుట్టూ తిరుగుతున్నారు. సిద్ధిపేట, గజ్వేల్, దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మెన్ పదవులతో పాటు సుడా (సిద్ధిపేట అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) చైర్మెన్ పదవులకు పోటీ పడుతున్నారు. పదవులు ఆశిస్తున్న వారు కాంగ్రెస్ ఇంచార్జీలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇన్చార్జిల కనుసన్నల్లోనే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఇటీవలే నియామకం...

జిల్లా స్థాయిలో గౌరవప్రదమైన హెూదా కలిగిన పదవి గ్రంథాలయ సంస్థ చైర్మెన్. ఈ పదవికి తీవ్ర పోటీ ఉన్నట్లు ప్రచారం జరిగినప్పటికీ అనూహ్యంగా కాంగ్రెస్ సీనియర్ నేత కేడం లింగమూర్తిని సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గా నియమించారు.

సుడా చైర్మన్ పోస్టుకు తీవ్ర పోటీ....

సిద్ధిపేట అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మెన్ పోస్ట్‌కు తీవ్ర పోటీ నెలకొంది. గతంలో కేవలం సిద్ధిపేట అర్బన్ మండలానికి సంబంధించిన నాయకులకి మాత్రమే ఈ సుడా చైర్మెన్ పదవికి అవకాశం ఉండేది. అయితే ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధిపేట జిల్లా మొత్తాన్ని 'సుడా'లో విలీనం చేయడం ద్వారా జిల్లాలోని 5 మున్సిపాలిటీలు, 246 గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నేతలు ఈ పదవి కోసం పోటీపడే అవకాశం ఉంది.

రైతుబంధు సమితీలు కొనసాగేనా..?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా, మండల స్థాయిలో రైతుబంధు సమితీలను ఏర్పాటు చేసింది. అయితే వీటిని ఇలాగే కొనసాగిస్తారా.? లేదా రద్దు చేస్తారా.? అన్నది ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నిర్ణయం మీదనే ఆధారపడి ఉంది. జిల్లాలో 7 మార్కెట్లు, 3 ఉప మార్కెట్లున్నాయి. సిద్ధిపేట, హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్, దుబ్బాక మార్కెట్లు ఉన్నాయి. గత బీఆర్ఎస్ సర్కార్ రిజర్వేషన్ల ప్రాతిపదికన వీటికి చైర్మెన్ పదవులను కేటాయించింది. సిద్ధిపేట జిల్లాలో దుబ్బాక నియోజకవర్గానికి సంబంధించిన వ్యవసాయ మార్కెట్ కమిటీలను తప్పా మిగతా మండలాల్లో ఇదివరకే కొన్నింటికి కొత్త కార్యవర్గాన్ని నియమించారు. అయితే దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా కాంగ్రెస్ దుబ్బాక మండల అధ్యక్షులుగా కొనసాగుతున్న కొంగర రవిని సెలెక్ట్ చేయడం జరిగిందన్న చర్చ మండలంలో జోరుగా నడుస్తోంది.

దేవస్థాన కమిటీలకు తీవ్ర పోటీ...

సిద్ధిపేట జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాలైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి, నాచారం గుట్ట లక్ష్మీనరసింహస్వామి, అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి రామలింగేశ్వర స్వామి, దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట మల్లికార్జున స్వామి, సిద్ధిపేట వెంకటేశ్వర స్వామి, పుల్లూరు బండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల చైర్మెన్ పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. వీటికి దేవాలయ పాలక కమిటీలను నియమించి ఉత్సవాలు, జాతరలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఆలయాల జాతరలకు ప్రతీ ఏటా రూ.లక్షల ఆదాయం వస్తుంది. ఈ ఆలయాలకు సంబంధించి దేవస్థాన కమిటీ చైర్మెన్, డైరెక్టర్ పదవుల కోసం కాంగ్రెస్ నాయకులు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నట్లు సమాచారం. కూడవెల్లి రామలింగేశ్వర ఆలయ చైర్మెన్‌గా ఉషయ్యగారి రాజిరెడ్డి, రేకులకుంట మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మెన్‌గా అనంతుల శ్రీనివాస్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. దుబ్బాక నియోజకవర్గంలో ఈ నామినేటెడ్ పదవులు ఎవరెవరికి దక్కుతాయో అన్న తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే కాంగ్రెస్ అధిష్టానం ఎవరెవరికి ఈ పదవుల్ని కట్టబెడుతుందో మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

రూ.12 వేల పథకానికి విధి విధానాలను రూపొందించండి

- మంత్రి సీతక్కకు దళిత ప్రజా సంఘాల వినతి
- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-మిరుదొడ్డి

భూమి లేని ఉపాధి హామి, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందజేసే పథకాన్ని ప్రవేశపెట్టి విధివిధానాలను రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రికి దళిత, వ్యవసాయ ప్రజా సంఘాల నాయకులు విన్నవించారు. శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో మంత్రి నివాసంలో సీతక్కను దళిత, ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించి చర్చించినట్లు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందజెస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన సభల్లో కూలీల ఆర్థిక సహాయానికి దరఖాస్తులను స్వీకరించారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1200 కోట్లను సైతం కేటాయించారన్నారు. ఇటీవల డీప్యూటీ సీఎం, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కూలీల ఆర్థిక సహాయ పథకాన్ని డిసెంబరు 28 నుంచి అమలు చేస్తామని వేర్వేరుగా ప్రకటించినప్పటికి ఈ పథకం అమలుకు నేటికి మార్గదర్శకాలను విడుదల చేయలేదన్నారు. పత్రికల్లో వివిధ కథనాల ప్రకారం భూమి లేని వారికి, ఉపాధి హామీలో వంద రోజులు పూర్తి చెసిన కూలీలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తున్నది ప్రచారం జరుగుతుందన్నారు. కనుక వందరోజుల ప్రతిపాదికన ఆర్థిక సాయం అందజెస్తే లక్షలాది మంది కూలీలలు నష్టపొతారన్నారు. భూమిలేని, ఒక ఎకరం లోపు భూమి వున్న కుటుంబాలకు ఈ పథకానికి ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ సంఘాల నేతలు నాగయ్య, వెంకట్రాములు,విస్సా కిరణ్,స్కైబాబ్ బాబు,కొండల్,హర్ష పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు



నవతెలంగాణ-సిద్ధిపేట

గత ప్రభుత్వం రాష్ట్రంలో విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తే, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని అలాగే కొనసాగించి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా ఉన్న రాష్ట్రం నేడు పాలకుల స్వార్థపూరిత ఆలోచనల వల్ల ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టల్లు సమస్యల కుంపటిలా మారాయన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏబీవీపీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ, విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. సిద్ధిపేట పట్టణంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో మూడు తీర్మానాలు ఆమోదించామన్నారు. మహాసభల్లో ఆమోదించిన విద్యారంగ సమస్యల తీర్మానాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. విద్యార్థి, నిరుద్యోగులు కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించి కాంగ్రెస్‌ను గద్దెనెక్కిస్తే కాంగ్రెస్ కూడా అదే బాటలో పరిపాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో విద్యకు 14 శాతం నిధులు కేటాయిస్తే, తెలంగాణలో విద్యకు 7 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. గురుకులల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో చనిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. ఏబీవీపీ నినాదం ఇస్తే ఆచరిస్తోందని, ఎక్కడ విద్యార్థులకు సమస్యలు తలెత్తినా అక్కడ ఏబీవీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు అన్ని వర్గాల ప్రజలకు ఏబీవీపీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వివేక్ వర్ధన్, జిల్లా కన్వీనర్ ఆదిత్య, నగర కార్యదర్శి పరశురాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫణీందర్ పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- డిసెంబర్ 30న జరుగు కలెక్టరేట్ ధర్నాలను జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్ స్వామి డిమాండ్

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

హమాలీ కార్మికులందరికీ వెల్ఫర్ బోర్డ్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు మామిడాల కనకయ్య అధ్యక్షతన జరగగా కాముని గోపాలస్వామి పాల్గొని మాట్లాడుతూ హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఐకేపీలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వమే రేటు నిర్ణయించి అమలు చేయాలని, తాడుమామూలు కూడా ప్రభుత్వమే చేయాలని కోరారు. హమాలీ కార్మికులకు 50 ఏండ్లు పైబడిన వారందరికీ రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, సహజ మరణాలు పొందిన వారికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. హమాలీ పనిచేస్తున్న కార్మికుల కుటుంబాల్లో వారి పిల్లల చదువుల కోసం ఉచిత విద్య అందించాలని, స్కాలర్షిప్ ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. ఇల్లు లేని నిరుపేదలైన హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల్లో మొదటి వరుసలో ఉంచాలని కోరారు. హమాలీ సమస్యల పరిష్కారం చేయాలని ఈనెల 30వ తేదీన చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారి సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎల్లయ్య, బిక్షపతి, రాజయ్య, బాలరాజు, బాల పోశయ్య, పరశురాములు, మహేష్ పాల్గొన్నారు.




29న మూడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తొగుట

జనగామలో జరిగే 3వ మహాసభకు అధిక సంఖ్య రజకులు తరలి రావాలని ఆహ్వానం పలుకుతూ తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం తొగుట మండల కేంద్రంలో మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర 3వ మహాసభకు రావాలని కోరారు. మహాసభకు జిల్లాలో ఉన్న రజక విద్యావేత్తలు, మేదావులు, నాయకులు, మహిళలు, తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో రజకుల హక్కుల కోసం పోరాటం చేయవలసిన అవసరం వుందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉన్న రజకులు బారి ఎత్తున పాల్గొలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు చింతకింది కరుణాకర్, మండల నాయకులు గౌరారం సత్తయ్య, జూపల్లి నర్సింలు, రాచకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-బెజ్జంకి

రేపు జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్ యందు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి, జాతీయ ధోబీ రిజర్వేషన్ సంఘ్ అధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించనున్న మూడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రజక సంఘం మండలా ధ్యక్షుడు దీటీ రాజు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. మండలంలోని రజక సంఘం నాయకులు, కులస్తులు పెద్ద సంఖ్యలో హజరై రాష్ట్ర మహాసభల ర్యాలీ, సభను జయప్రదం చేయాలని రాజు కోరారు.

కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు మానవహారం







నవతెలంగాణ-కొండపాక

అంబేద్కర్‌పై అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి భర్తఫ్ చేయాలని అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొండపాక మండలం వెలికట్ట చౌరస్తా వద్ద అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్లో అవమానిస్తూ మాట్లాడిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌ను మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకించే వాళ్లని ఆ మానీయుడిని బీజేపీ ఏనాడు గౌరవించలేదన్నారు. దళితులు గిరిజనుల సమస్యలు ఏ రోజు కూడా వారికి పట్టలేదని విమర్శించారు. దళితులు గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని, మరో పక్క అమీత్ షా మాటలను ప్రధానమంత్రి మోడీ సమర్ధించడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బర్మ కొమురయ్య, పల్లె శ్రీనివాస్ జలగావమా ప్రభాకర్ రైతు సంఘం మండల కార్యదర్శి మూడోజు కనకాచారి, నాయకులు వేముల ఎల్లయ్య, పెరక మల్లేశం, ఎల్లారి కిష్టయ్య, పరశురాములు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటఅర్బన్: కేంద్ర హెూంశాఖా మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను చేయడాన్ని సీఐటీయూ ఖండిస్తుందనీ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ళ భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సందర్భంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. తక్షణం అమిత్ షా క్షమాపణలు చెప్పడంతో పాటు తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు ఉచ్ఛరించడమే నేరమన్నట్లుగా అసహనం ప్రదర్శించడం బీజేపీ ఆర్ఎస్ఎస్ తన వక్రబుద్ధిని చూపించింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రజలు, ప్రజాతంత్ర లౌకికవాదులు పోరాటంలోకి కలిసి రావాలని అన్నారు. వెంటనే అమిత్ షాను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన పెద్ద ఎత్తున చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్, నాయకులు మాచారపు రాజనర్సు, యాదగిరి, మల్లయ్య, లలిత, అండాలు, రాజయ్య, మహేందర్, చందర్, ఎల్లవ్వ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్: కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహంకు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజ్యాంగం నిర్మత అంబేద్కర్‌పై పార్లమెంట్లో కూర్చొని అనుచిత వ్యాఖ్యలు చేయడం జరిగిందని వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ కుట్రలో భాగంగా దేశంలో మన స్మృతిని అమలు చేయాలని ఉద్దేశంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాజ్యాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, వేణుగోపాల్ రంగారెడ్డి, నర్సింలు, చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు, ప్రవీణ్, యాదగిరి, మనోజ్ కుమార్, రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది

-కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్



నవతెలంగాణ-మర్కుక్

మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మరణంతో గొప్ప నాయకుడిని కోల్పోయిందని కాంగ్రెస్ మర్కుక్ మండలా ధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్‌లో కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి అధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేసి, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల వేత్త అని కొనియాడారు. ఆయన ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దుబిడ్డ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి ,నాయకులు పత్తి నర్సింలు, వనం ఆంజనేయులు, మొర్సు శ్రీనివాస్ రెడ్డి, గుర్రాల నర్సింలు, శ్యాం ప్రసాద్ గౌడ్, శివ, వెంకటేశం, సత్యనారాయణ, భాస్కర్, కృష్ణ, బీర్ బాల్ సింగ్, సత్యనారాయణ ,రాజు, తదితరులున్నారు.

ఆలయంలో ఘనంగా మహా మండల పూజ

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో వైభవంగా మహా మండల పూజ, కార్యక్రమం నిర్వహించారు. నంగునూరి నవీన్ స్వామి, కాపర్తి మణిదీప్ స్వామి, ఉప్పల కిషోర్ స్వామి, బుద్ధ రమేష్ స్వామి, గుడాల సందీప్ స్వామి, బిక్కుమల్ల నాగరాజు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం కన్నుల పండుగ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు మహా అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప దేవాలయం కమిటీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ గురు స్వామి మాట్లాడుతూ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలతో అందరూ బాగుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు నంద బాల శర్మ అయ్యప్ప స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలి ఉద్యోగుల నూతన సంఘం ఎన్నిక

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ఎన్నికలు పట్టణంలోని మార్కండేయ గుడి ఆవరణలో జరిగాయని నూతన జిల్లా అధ్యక్షులు మామిడాల రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంఘంగా ఏర్పడితే మన సమస్యల పరిష్కారానికి తొందరగా పరిష్కారం లభిస్తుందన్నారు. ఐక్యంగా ఉండడం జరుగుతుందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా దేవసాని వాసుదేవ్, అసోసియేట్ అధ్యక్షులుగా నరసింహులు, ఉపాధ్యక్షులుగా లెగిసెట్టి రాజు, సత్యనారాయణ, స్వామి, కుమార్, జాయింట్ సెక్రెటరీలుగా సాయి, అనిల్ కుమార్, ప్రియాంక, సురేష్, ప్రచార కార్యదర్శులుగా రాజేందర్ ప్రసాద్, జమున రాణి, కోశాధికారిగా రచ్చ రమేష్, కార్యవర్గ సభ్యులుగా నందాల రవికుమార్, రమేష్, వేణుగోపాల్, చతుర్వేది, దేవేందర్, అనిల్ కుమార్, బిక్షపతి, శ్రీధర్, తిరుపతి, నితీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

విద్యాశాఖలో విలీనం చేయాలంటూ సమ్మె బాటలో..

నవతెలంగాణ-దుబ్బాక

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు తమను విద్యా శాఖలో విలీనం చేయాలని కోరుతూ సమ్మెబాట పట్టారు. సిద్దిపేట జిల్లాలోనూ గత 18 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్నారు. దీంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), భవిత కేంద్రాల్లో విద్యా బోధన పూర్తిగా నిలిచిపోయింది. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కూడా సమ్మెబాట పట్టడంతో విద్యాశాఖ కార్యాలయాల్లో పాలన పూర్తిగా స్థంభించింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, మండల విద్యావనరుల కేంద్రాల్లో ఏపీవోలు, డేటా ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీవోలు, సీఆర్పీలు, అటెండర్లు,మెస్సెంజర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, భవిత సెంటర్లలో పనిచేస్తున్న ఐఈఆర్పీలు సమ్మెలో పాల్గొంటున్నారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 858 మంది సిబ్బంది సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్నారు. వారంతా గత 18 రోజులుగా సమ్మె బాట పట్టారు. వీరిలో యుఆర్ఎస్, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది-521 మంది ఉండగా, డీపీఓ సిబ్బంది-10 మంది, ఎంఆర్సీ స్థాయిల్లో 100 మంది సిబ్బంది, సీఆర్సీ స్థాయిలో -227 మంది కలిపి మొత్తంగా 858 మంది ఉన్నారు. వీరంతా సమ్మెబాట పట్టడంతో పాలనపూర్తిగా స్తంభించింది.





సమ్మెతో కేజీబీవీల్లో నిలిచిన బోధన

జిల్లాలోని కేజీబీవీలలో సమగ్ర శిక్షా అభియాన్‌లో భాగంగా పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మొత్తం సమ్మెబాట పట్టడంతో కేజీబీవీల్లో తరగతుల నిర్వహణ పూర్తిగా అటకెక్కింది. కేజీబీవీల్లో పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులు సైతం చదువుకుంటున్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న ప్రస్తుత కీలక సమయం వేళ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోంది. దుబ్బాక లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ ప్రతీరోజు పాఠాలు చెబుతున్నారు.

సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదు

18 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం. 20 ఏళ్లుగా సమగ్ర శిక్షాలో చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 25 రోజుల పాటు సమ్మె చేశాం. సమగ్ర శిక్షా ఉద్యోగులకు గతంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి హాజరై ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిం చకపోవడంతో సమ్మెబాట పట్టారు. అప్పటి పీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మా సమ్మెకు హాజరై సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా హామీలను నెరవేర్చకపోవడం బాధాకరం.

-డీ.దేవరాజు, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం దుబ్బాక మండల అధ్యక్షులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రామస్వామి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

జిల్లా కలెక్టరేట్ ముందు తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ కొరకు నిరవధిక సమ్మె చేస్తున్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా 18వ రోజు సమ్మె కార్యక్రమంలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ చని పోయిన దేశ ప్రధాని, ఆర్థిక మేధావి డాక్టర్.మన్మోహన్ సింగ్‌కు ఆత్మ శాంతి చేకూరాలని దీక్ష శిబిరంలో 2ని॥ మౌనం పాటించి నివాళులు అర్పించారన్నారు. సమ్మె కి మద్దతుగా పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తోట సతీష్, టీపీటీఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రామస్వామి, హన్మకొండ మాజీ(డీఈ ఓ)నల్గొండ ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రమోహన్ గారు మాట్లాడుతూ వీరి సమస్యల పరిష్కరించాలని చాలు చాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నప్పుడు గత ఏడాదిలో దీక్షలు చేసిన సందర్భంలో రేవంత్ రెడ్డి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఏడాది అయిన ఇచ్చిన సమస్యను ఇచ్చినటువంటి హామీని పరిష్కరించలేదు కనుక వీరి యొక్క న్యాయమైన డిమాండు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరవధిక సమ్మెకు దిగడం జరిగిందన్నారు. వెంటనే పరిష్కరించని యెడల వీరి యొక్క సమ్మెను ఉధృతం చేస్తామని, వీళ్ల ఉద్యమానికి మద్దతు తెలుపుతూ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బాలకిషన్ జిల్లా ప్రధానకార్యదర్శి డ్యాగ నవీన్ కుమార్ జిల్లా కోశాధికారి కరుణాకర్ రాష్ట్ర నాయకులు సురేందర్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



వాహనాలకు నిప్పటించి దగ్ధం చేయడం బాధాకరం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య

నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్బర్ పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల గుర్తు తెలియని దుండగులు గోల్కొండ మోడల్ స్కూల్ వాహనాలను నిప్పంటి దగ్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, ట్రెస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్ రెడ్డిలు కలిసి శుక్రవారం స్కూల్ ప్రిన్సిపల్ రవిని పరామర్శించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, పాఠశాల సంబంధించిన వాహనాలను గుర్తు తెలియని దుండగులు నిప్పంటించి దగ్ధం చేయడం బాధాకరమన్నారు. దుండగులను పట్టుకొని ఎంతట వారైనా శిక్షించాలని పోలీసులకు ఆదేశించడం జరిగిందన్నారు. అధైర్య పడొద్దు తాము అంతా అండగా ఉన్నామని తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం ట్రెస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలకు అండగా ట్రెస్మా ఉంటుందని దుండగులను శిక్షించేలా పోలీసులకు తెలిపడం జరిగిందని అన్నారు.ట్రెస్మా తరుపున పాఠశాలకు ఆర్థిక సహాయం రూ.105,000 ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి కుంట రాజు, ట్రెస్మా జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్

























నవతెలంగాణ-జగదేవపూర్

మన్మోహన్ సింగ్ 10 ఏండ్ల పదవీకాలంలో ఉపాధిహామీ ,గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి అనేక కొత్త పథకాలను అమలు చేశారని, అలాగే తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు బిల్లు కూడా మన్మోహన్ సింగ్ హయంలోనే ఏర్పాటు అయింది అని గజ్వేల్ నియోజవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, తిగుల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాశ్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు నర్సింలు, నాయకులు ఎండి. అంజత్, ఎండి. గౌస్, ఎండి అబ్బు.ఎండి షాబుద్దీన్. వెంకటేష్, వెంకట్ రెడ్డి, నరసింహులు, దాసు, స్వామి, రతన్, లక్ష్మణ్, రవి, కొండపోచమ్మ పాలకవర్గ సభ్యులు నర్సింలు ఆశయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు : మండల కేంద్రంలో ఆర్థిక సంస్కరణ సారథి, భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్‌కి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక స్వేచ్ఛకు చాణిక్యుడని, రెండుసార్లు దేశ ప్రధానిగా, మచ్చలేని రాజనీతజ్ఞుడని కొనియాడారు. దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందని భావోద్వేగంగా పేర్కొన్నారు. మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మరణం దేశానికి తీరని లోటని, భారత దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణల ఆద్యులలో ఒకరని కొనియాడారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, యూజీసీ చైర్మెన్‌గా విశిష్ట సేవలందించిన ఆయన ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఎం.డి ఇమ్రాన్, నాయకులు బడే అశోక్, సదానందం, నీల రాకేశ్, శ్రీధర్, ప్రశాంత్, శివ, ప్రకాష్ సేట్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆధ్వర్యంలో..మండల కేంద్రంలో శుక్రవారం మాజీ ప్రధాని ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడారు. అతి సాధారణ కుటుంబంలో పుట్టి కిరోసిన్ దీపాల వెలుగులో చదువుకున్న మన్మోహన్ సింగ్ దేశ అత్యున్నత స్థానానికి చేరుకున్నారన్నారు. యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకూ ప్రధానిగా, 33 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నా వారు దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు పరిస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోహెడ: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి తీరనిలోటని కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం న్యూఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధకరమైన విషయమన్నారు. అలాగే ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థికశాఖ కార్యదర్శిగా ఉన్నత పదవులను పొంది దేశాన్ని గొప్ప ఆర్థిక శక్తిగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మెన్ బోయిని నిర్మల జయరాజ్, వైస్ చైర్మెన్, డైరెక్టర్‌లు, కొమురవెళ్లి దేవస్థాన డైరెక్టర్, గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పాల్గొన్నారు.

బెజ్జంకి: భారత దేశ ఆర్థిక ప్రగతికి ప్రధానిగా మన్మోహన్ సింగ్ సంస్కరణలు చేపట్టి రూపశిల్పిగా సేవలందించాడని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. ఏఎంసీ వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ పాలక వర్గ సభ్యులు జెల్లా ప్రభాకర్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, యువజన మండలాధ్యక్షుడు సందీప్, నాయకులు రొడ్డ మల్లేశం, భైర సంతోష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో..మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు బోనగిరి రాజ్ కుమార్ కొనియాడారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.

సిద్దిపేట : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి యావత్ దేశానికి తీరని లోటని కాంగ్రెస్ అర్బన్ మండల అధ్యక్షులు బిక్షపతి అన్నారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి 10 ఏండ్లు ప్రధానిగా దేశానికి ఎన్నో సంస్కరణలు తెచ్చిన గొప్ప వ్యక్తి అని, మన యందు లేకపోవడం చాలా బాధాకరమని, ఒక మహోన్నత వ్యక్తి, ఒక ఆర్థికవేత్త మన దేశానికి ఎన్నో సంస్కరులు తెచ్చినటువంటి గొప్ప నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్కసతీష్ కుమార్, దాస అంజయ్య, బొల్లు నరేష్, స్రవంతి, స్నేహ, రేణుక, మల్లేశం, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో..భారతదేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని పీసీసీ కార్యదర్శి గంప మహేందర్, రాష్ట్ర యుత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దం లక్ష్మి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి కలిముద్దీన్, డీసీసీ ఉపాధ్యక్షుడు మంద పాండు అన్నారు. శుక్రవారం సిద్దిపేట కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. భౌతికంగా వారు దూరం అయిన, ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు, చట్టాల రూపంలో భారతదేశ అభివృద్ధిలో సజీవంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్క సతీష్, రేణుక, వాహబ్, అంజయ్య, అంజి రెడ్డి, మల్లారెడ్డి, సదాశివ రెడ్డి, షోబొద్దిన్, మార్క పద్మ వహీద్ ఖాన్, పాల్గొన్నారు.

గజ్వేల్ : భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం బాధాకరమని అయన చిత్రాన్ని అవాలతో అద్భుతంగా చిత్రించి రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ఘన నివాళులు అర్పించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాప, అధ్యక్షులు రామకోటి రామరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గొప్ప వ్యక్తిని ఈ దేశం కోల్పోయింది. తనదైన ప్రతభ, జ్ఞానంతో భారత దేశానికి ప్రధానిగా అపూర్వ సేవలందించిన మహనీయుడన్నారు. తెలంగాణ ప్రజల ఎన్నో దశబ్దాల ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ను నెరవేర్చింది మన్మోహనే అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఈ చిత్రాన్ని చిత్రించి ప్రార్థిస్తున్ననన్నారు.

అక్కన్నపేట: దేశ మాజీ ప్రధాని, ఆర్థిక జ్ఞాని గొప్ప మేధావి మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దేశ మాజీ ప్రధాని, ఆర్థిక జ్ఞాని గొప్ప మేధావి మన్మోహన్ సింగ్ మరణాన్ని చింతిస్తూ సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక వ్యవస్థలు నిలదొక్కుకోవడానికి ఆయన ఎన్నో సంస్కరాలు చేశారని, దేశ ప్రధానిగా ఆయన ఎన్నో సేవలు చేశారని, ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం, తదితర చట్టాలు అమలు చేశాడని కొనియాడారు. రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్ర మరువలేనిదని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంగ్రెస్ మండల పక్షాన కోరారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ రెడ్డి, కట్కూర్ సింగల్విండో వైస్ చైర్మెన్ ముకుంద రెడ్డి, పట్టణ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, సింగల్విండో డైరెక్టర్ బండి కుమార్, మార్కెట్ కమిటి సభ్యులు బైకని శ్రీనివాస్, పత్తిపాక త్రిమూర్తి, కరోంటోతూ రవి, నాయకురాలు తాళ్లపల్లి సుజాత,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాండ్రాల దామోదర్, చొక్కం గణేష్, పాల్గొన్నారు.

మద్దూరు: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మృతి దేశానికి తీరని లోటు అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్, ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బూరుగు శంకర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు రాచకొండ ఉప్పలయ్య, తాజ్ మహమ్మద్, ఫసి మహమ్మద్, శ్రీకాంత్, నవీన్ కుమార్, తదితరులున్నారు.

రాయపోల్: భారత మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మరణం దేశానికి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాయపోల్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తప్పెట సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ రెండుసార్లు ప్రధానమంత్రిగా పనిచేశారు. రాజకీయ వేత్తకంటే నైపుణ్యం కలిగిన ఆర్థికవేత్తగా తనదైన ముద్ర వేశారు. ఆయన ఆర్థిక విధానాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందడమే కాకుండా సామాన్యుల జీవితాల్లో కూడా పెద్ద మార్పు వచ్చింది. విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం వంటి గొప్ప పథకాలను ఆయన కాలంలోనే ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప మల్లేశం, సీనియర్ నాయకులు సత్తుగారి కిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి, దుర్గాప్రసాద్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు కరుణాకర్, సోషల్ మీడియా కన్వీనర్ రమేష్, ఇంద్రకరణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మిరుదొడ్డి : మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం బాధాకరమని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దిరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్ గ్రామపంచాయతీ వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి అశ్రునివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. 1991 వ సంవత్సరంలో భారతదేశం అప్పుల పాలై ఆర్థిక వ్యవస్థ పూర్తిగా పతన వ్యవస్థలో ఉన్న సమయంలో ఆర్థిక సంస్కరణలను మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టారని అన్నారు. ఆయన సంస్కరణల ఫలితంగానే మన దేశాన్ని సంపద సృష్టిలో అగ్ర రాజ్యాలతో పోటీపడే విధంగా చేయడంలో ఆయన కృషి మరువలేనిది అని ఆయన అన్నారు. సింగ్ జీవిత కాలంలో అనేక రకాలైన పదవులు ఆయనను వరించాయని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని సుదీర్ఘంగా 10 ఏండ్ల కాలం పాటు నడిపించడంలో ఆయనకు అయనే చాటి అని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ చేసిన సేవలను గుర్తించిన భారతదేశం పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులతో భారత ప్రభుత్వం ఆయన్ని సత్కరించిందన్నారు. ఆయన బాటలో మనందరం నడవడమే మనం ఆయనకిచ్చే గొప్ప నివాళి అని డాక్టర్ పెద్దిరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్, బాలరాజు, బాపురెడ్డి, అమర్, ప్రశాంత్, శ్రీధర్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

మిరుదొడ్డి కాంగ్రెస్ ఆధ్వర్యంలో..భారత దేశ మాజీ ప్రధాని, ఆర్థిక వేత డాక్టర్ మన్మోహన్ సింగ్ సంతాప దిన సందర్భంగా వారికి కాంగ్రెస్ ఆద్వర్యంలో వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు అనంతల శ్రీనివాస్, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, దుబ్బాక మండల అధ్యక్షులు కొంగర రవి మాట్లాడుతూ భారత దేశనికి కాంగ్రెస్‌కి ఆయన మరణం తీరని లోటని, దేశ చరిత్ర లో దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒకటిగా నిలపెట్టిన నాయకుడు అని, కాంగ్రెస్ పార్టీ నేతగా ఎనలేని సేవలు అందించిన మహా నాయకులు డాక్టర్ మన్మోహన్ సింగ్ సిద్ధాంతాలను కొనసాగిస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ ఆకుల భరత్, కడుదురి నరేందర్ రెడ్డి, అనంతుల రాజు, కోనాపురం బాలు, మట్ట కిషన్ రెడ్డి, ఉత్తం నరేష్ తదితరులు పాల్గొన్నారు.